PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 211 | సంపుటి 4 | శుక్రవారం | 17-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర




# ఢిల్లీ పీఠంపై 'వేం' విజయకేతనం

## రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం...

- భారత పార్లమెంట్ లో ప్రతిధ్వనించిన తెలంగాణ గొంతుక
- రాజ్యసభలో అడుగుపెట్టిన ప్రజానేత
- తెలంగాణ భవన్ లో వేం నరేందర్ రెడ్డిని సత్కరించిన కాంగ్రెస్ నేత చిలువేరు సమ్మయ్య గౌడ్
- కేసముద్రం టు ఢిల్లీ జన జాతర
- దేశ రాజధానిలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- సేవకు దక్కిన సమున్నత గౌరవం..
- అభివృద్ధి ప్రదాత ప్రస్థానంలో చారిత్రక మైలురాయి

"మహబూబాబాద్ మట్టి బిడ్డ, కేసముద్రం గడ్డపై ప్రజా సమస్యల పోరాటాల నుంచి ఎదిగిన ధీశాలి వేం నరేందర్ రెడ్డి.. దేశ అత్యున్నత చట్టసభ అయిన రాజ్యసభలో అడుగుపెట్టి సరికొత్త చరిత్ర సృష్టించారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి రాజకీయ శిఖరాలను అధిరోహించిన ఆయన ప్రస్థానంలో ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిపోగా, దేశ రాజధాని వేదికగా తెలంగాణ ఆత్మగౌరవ గొంతుక మరోసారి మార్మోగింది."

**హైదరాబాద్ ప్రభాత గమనం..**
దేశ రాజధాని నడిబొడ్డున మహబూబాబాద్ జిల్లా ఆత్మగౌరవ నినాదం మరోసారి మార్మోగింది. కేసముద్రం మట్టిలో పుట్టి, ప్రజా సమస్యలే ఊపిరిగా ఎదిగి, అంచెలంచెలుగా రాజకీయ శిఖరాలను అధిరోహించిన ధీశాలి, మాజీ శాసనసభ్యుడు, ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి గురువారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. భారత దేశ పార్లమెంట్ భవనంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తుంటే, తెలంగాణ రాజకీయ యవనికపై ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది...

### - అభివృద్ధి ప్రదాతకు నీరాజనం : చిలువేరు సమ్మయ్య గౌడ్

ఈ చారిత్రక వేడుక సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత, జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ తన అభిమాన నాయకుడిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నరేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేస్తూ తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ..వేం నరేందర్ రెడ్డి భావోద్వేగంతో కూడిన అద్భుతమైన ప్రసంగం చేశారని వేం నరేందర్ రెడ్డి కేవలం ఒక పేరు కాదు, అది ఒక నమ్మకమని కొని



యాడారు. కేసముద్రం అభివృద్ధికి నిరంతరం పరితపించే ఆయన వ్యక్తిత్వం, పట్టుదలే నేడు ఆయనను దేశ అత్యున్నత సభలో అడుగుపెట్టేలా చేశాయన్నారు. మహబూబాబాద్ గడ్డ రుణం తీర్చుకునేందుకు ఆయనకు దక్కిన సమున్నత గౌరవం ఇదన్నారు. జాతీయ స్థాయిలో మన ప్రాంత సమస్యలను వినిపించే ఒక ధీర గొంతుక రాజ్యసభలో ప్రతిధ్వనించబోతుండటం మనందరికీ గర్వకారణం," అని సమ్మయ్య గౌడ్ కొనియాడారు. తమ ప్రియతమ నాయకుడి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కళ్లారా చూసేందుకు మహబూబాబాద్, కేసముద్రం మరియు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి కాంగ్రెస్ సైన్యం పోటెత్తింది. వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఢిల్లీ వీధులు కిక్కిరిసిపోయాయి. 'మన నరేందర్ రెడ్డి.. మన గర్వం' అంటూ చేసిన నినాదాలు ఢిల్లీ కోటను తాకాయి. తమ నేత జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అట్టడుగు స్థాయి నుంచి అగ్రస్థాయి వరకు నరేందర్ రెడ్డి సాగించిన ఈ రాజకీయ ప్రయాణం ఒక అద్భుత కావ్యం. గురువారం ఆయన రాజ్యసభ సభ్యుడిగా అడుగుపెట్టడం తెలంగాణ రాజకీయ చరిత్రలో, ముఖ్యంగా మహబూబాబాద్ గడ్డపై ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుగులోత్ దస్రు నాయక్,అల్లం నాగేశ్వర్ రావు,బానోత్ వెంకన్న నాయక్,నీలం దుర్గేష్, రావుల మురళీ, బండారు వెంకన్న, బండారు దయాకర్, అంబటి మహేందర్ రెడ్డి, పోలేపాక నాగరాజు, బండారు కృష్ణ, సతీష్, గుంజపడుగు రాజశేఖర్, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తేజావత్ వీరన్నకు 'మనం బుక్ ఆఫ్ రికార్డ్'

- నిరుపేద విద్యార్థుల పాలిట ఆశాకిరణం..
- ఉచిత శిక్షణతో 175 మందికి ఉద్యోగాలు

**కేసముద్రం, ఏప్రిల్ 16 (ప్రభాత గమనం):**
నిరుపేద విద్యార్థుల సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం పెద్దమోర్ తండా గ్రామానికి చెందిన తేజావత్ వీరన్నకు ప్రతిష్టాత్మకమైన 'ఇంటర్నేషనల్ మనం బుక్ ఆఫ్ రికార్డ్' పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి ఈ అవార్డును ప్రదానం చేశారు. తాను ఉద్యోగం సాధించే క్రమంలో ఎదుర్కొన్న కష్టాలు మరే ఇతర పేద విద్యార్థి పడకూడదనే ఉద్దేశంతో వీరన్న అలుపెరగని సేవలు అందిస్తున్నారు. 2023లో 5 వాట్సాప్ గ్రూపులను ప్రారంభించి, రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 8000 మందికి పైగా నిరుద్యోగులకు ఉచిత ఆన్లైన్ క్లాసులు, స్టడీ మెటీరియల్, ప్రాక్టీస్ పేపర్లను అందుబాటులోకి తెచ్చారు. కేవలం సమాచారానికే పరిమితం కాకుండా, దాతల సహకారంతో పేద విద్యార్థులకు పుస్తకాలు, షూస్ వంటి వస్తువులను కూడా సమకూరుస్తూ ఆదర్శంగా నిలిచారు.

### అద్భుత ఫలితాలు:

వీరన్న అందిస్తున్న శిక్షణ మరియు మార్గదర్శకత్వంతో ఇప్పటివరకు 175 మంది భారత రక్షణ దళం (ఆర్మీ) మరియు రాష్ట్ర పోలీస్ ఉద్యోగాలను సాధించడం విశేషం. ప్రతి రెండు నెలలకు ఒకసారి 30 మంది నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తూ దేశ సైనికులుగా తీర్చిదిద్దుతున్నారు. వీరన్న సామాజిక సేవలను గుర్తించిన 'మనం ఫౌండేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్' సంస్థ ఆయనను ఈ అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు ప్రదానోత్సవంలో మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చక్రవర్తి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్ మరియు సైనిక గ్రూప్ సభ్యులు పాల్గొని వీరన్న సేవలను కొనియాడారు. ఈ అవార్డు రావడం పట్ల స్థానికులు మరియు అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# డోర్నకల్ మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ వింత

## ఖాళీ స్థలం ఉన్నా వంకరగా వెళ్లిన సైడ్ డ్రైన్!

**డోర్నకల్, ఏప్రిల్ 16, ప్రభాతగమనం :**
డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని కబ్రిస్తాన్ ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న సైడ్ కాల్వ నిర్మాణంపై స్థానిక ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, కాల్వను రోడ్డు మీదికి వంకరగా ఎందుకు మళ్లించారో అర్థం కాక వాహనదారులు, బాటసారులు తలలు పట్టుకుంటున్నారు.సాధారణంగా సైడ్ కాల్వలు రోడ్డుకు సమాంతరంగా, నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా నిర్మిస్తారు. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది. కబ్రిస్తాన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని వదిలేసి, కాల్వను ఏకంగా రోడ్డు మధ్యలోకి తీసుకురావడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. "అక్కడ ఏవైనా అడ్డంకులు ఉంటే అర్థం చేసుకోవచ్చు, కానీ ఖాళీ స్థలం ఉండగానే కాల్వను ఇలా వంకరగా తిప్పడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి?" అని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు.మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి అస్తవ్యస్త నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ గారు స్పందించి, ఆ వంకరగా ఉన్న కాల్వ భాగాన్ని




సవరించి, రోడ్డు వెడల్పుకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.ఒకవేళ అధికారులు ఈ నిర్మాణాన్ని సవరించకుండా ప్రజలపై రుద్దాలని చూస్తే, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా, CDMA (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్), MA&UD ప్లానింగ్ అధికారులు, మరియు అవసరమైతే మానవ హక్కుల కమిషన్ (Human Rights) కు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని బాధితులు హెచ్చరిస్తున్నారు.

# డోర్నకల్ మున్సిపాలిటీలో రాజకీయ సెగ

- కాంగ్రెస్ యువ నాయకుడికి అవమానం?

**డోర్నకల్, ఏప్రిల్ 16, ప్రభాతగమనం :**
డోర్నకల్ మున్సిపల్ కార్యాలయం వేదికగా జరిగిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చివరలో చోటుచేసుకున్న ఒక ఘటన స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దాసరి నాని యాదవ్‌ను అందరి ముందే అవమానించారనే వార్త ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ముగిసిన అనంతరం నాయకులంతా మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో సమావేశమయ్యారు. ఆ సమయంలో అక్కడ ఉన్న కుర్చీలో నాని యాదవ్ కూర్చుని ఉండగా, మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త మాదా శ్రీను అక్కడికి చేరుకున్నారు. నాని యాదవ్‌ను ఉద్దేశపూర్వకంగానే కుర్చీలోంచి లేపినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లోనే, అందరూ చూస్తుండగానే జరిగిన ఈ పరిణామంతో నాని యాదవ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.ఈ ఘటనపై దాసరి నాని యాదవ్ స్పందిస్తూ తన ఆవేదనను వెళ్లగక్కారు. "ప్రజాప్రతినిధుల మధ్య, పార్టీ నాయకుల మధ్య కనీస గౌరవం ఉండాలి. ఒకే పార్టీలో ఉంటూ ఇలాంటి అహంకార పూరిత చర్యలకు పాల్పడటం దురదృష్టకరం. ఇలాంటి వ్యక్తిగత కక్షలు లేదా అహంభావాలు పార్టీ ప్రతిష్టను ప్రజల్లో దెబ్బతీస్తాయి," అని ఆయన పేర్కొన్నారు.ఈ ఉదంతంపై స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు మరియు రాజకీయ విశ్లేషకులు భిన్నంగా స్పందిస్తున్నారు.




# తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు

**తెలంగాణ ఉద్యమకాల ఫోరం ధ్వజం**

**ఇల్లందు/గార్ల, ప్రభాత గమనం:**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా అవమానించడమేనని తెలంగాణ ఉద్యమకాల ఫోరం (TUF) నేతలు మండిపడ్డారు. ఈ అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయన వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గురువారం గార్ల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో టీయూఎఫ్ నేతలు మాట్లాడుతూ, వేలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణను ఒక శత్రుదేశ విభజనతో పోల్చడం తేజస్వి సూర్య మూర్ఖత్వానికి నిదర్శనమని విమర్శించారు. "తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదు. ఢిల్లీ పీఠంపై కూర్చుని క్షేత్రస్థాయి చరిత్ర తెలియకుండా మాట్లాడటం సరికాదు." అని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ



చెప్పాలి.క్షమాపణ చెప్పని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకాల ఫోరం ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ జగదీష్, గార్ల మండల అధ్యక్షులు షేక్ జానిమియా, గార్ల టౌన్ అధ్యక్షులు దార్ల మల్లిబాబు, నాయకులు కుడిదొడ్డి కాంతారావు, పిల్లలమర్రి వీరస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అర్పనపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా గంధసిరి యాకన్న

**కేసముద్రం ఏప్రిల్ 16(ప్రభాత గమనం):**
అర్పణపల్లి గౌడ సంఘం సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక గ్రామంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ ఎన్నికలో సొసైటీ అధ్యక్షునిగా గంధసిరి యాకన్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గంధసిరి యాకన్నా మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న గౌడ సంఘం సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సొసైటీ అభివృద్ధికి, కులస్తుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తాను. విద్య, ఉపాధి, ఆరోగ్యంతో పాటు సంఘం సభ్యులకు, గీత కార్మికులకు పింఛన్లు అందేలా కృషి చేస్తాను. అన్ని రంగాల్లో సంఘం సభ్యులకు అండగా నిలుస్తాను" అని హామీ ఇచ్చారు.నూతన కార్యవర్గానికి కుల సంఘం పెద్దలు, సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం ఐకమత్యంగా ఉండటం వల్లే ఏకగ్రీవ ఎన్నిక సాధ్యమైందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గౌడ కుల పెద్ద మనిషి బుచ్చిరాములు, సారుకొల్లా గంధం సంతోష్, మాజీ అధ్యక్షులు గంధం వెంకన్న, ఉపాధ్యక్షులు గంధం శ్రీను, ప్రధాన కార్యదర్శి గంధం వేంకటాద్రి మెంబర్లు రంగయ్య, ఎల్లయ్య, ఐలయ్య, గంగాపురపు యాదగిరి, బుర్ర సుధాకర్, బబ్బురు సతీష్, కందల శ్రీకాంత్, నలమాషా రాములుతో పాటు గౌడ సంఘం పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య
# భేషరతుగా క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్...
- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చినా రాష్ట్ర ఎంపీల మౌనంపై ఆగ్రహం
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన తీరును తెలంగాణ సమాజం గమనిస్తోందని వ్యాఖ్య
- తెలంగాణపై వ్యతిరేకత బీజేపీకి నరనరాల్లో నిండి ఉన్నది
- ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్




**హైదరాబాద్, ప్రభాత గమనం:**
పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని ఆయన మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణ వ్యతిరేక తను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటుపైన పదే పదే విషం కక్కుతూ... బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని ఆయన గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

## డోర్నకల్ మున్సిపాలిటీలో
# తాగు నీటికి తండ్లాట

- 14వ వార్డుపై పాలకుల వివక్ష?
- మరమ్మతు పేరుతో బోరింగ్ విప్పి 20 రోజులు..
- పట్టించుకోని అధికారులు

**డోర్నకల్, ఏప్రిల్ 16, ప్రభాతగమనం :**
డోర్నకల్ మున్సిపాలిటీలోని 14వ వార్డు ప్రజలు గత కొన్ని నెలలుగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు, పాలక వర్గం ఘోరంగా విఫలమయ్యాయని వార్డు ప్రజలు మండిపడుతున్నారు.14వ వార్డులోని కొలిపాక పుల్లారావు ఇంటి పక్కన ఉన్న పబ్లిక్ బోరింగ్ పాడవడంతో స్థానికులు వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ వెంటనే సిబ్బందిని పిలిపించి బోరింగ్ మోటార్, పైపులను విప్పించారు. కొత్త సామాన్లు తెచ్చి వెంటనే మరమ్మతులు పూర్తి చేస్తామని హామీ



ఇచ్చి 20 రోజులు గడిచినా, నేటికీ ఆ పనులు అడుగు ముందుకు పడలేదు. విప్పిన పైపులు రోడ్డు పక్కన పడి ఉండటంతో ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది.ఈ ఆలస్యంపై వార్డు కౌన్సిలర్‌ను వివరణ కోరగా.. "వార్డులో నీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ మరియు చైర్మన్‌కు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. నేను ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్ కావడంతో కావాలనే మా వార్డు సమస్యలను పరిష్కరించడం లేదు. సిబ్బందిని పంపమన్నా, నిధులు కేటాయించమన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారు." అని ఆయన ఆరోపించారు.మున్సిపల్ అధికారుల ఉదాసీనతపై 14వ వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మధ్య ఉన్న రాజకీయ విభేదాలకు సాధారణ ప్రజలను బలి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, చైర్మన్ గారు స్పందించి వెంటనే బోరింగ్ మరమ్మతులు పూర్తి చేసి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ ఇంకా జాప్యం జరిగితే, ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పెద్ద ఎత్తున ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరించారు.





# గార్ల, బయ్యారం మండలాలతో ప్రత్యేక ఏజెన్సీ నియోజకవర్గం సాధించాలి

- JAC డిమాండ్
- గార్లలో ముమ్మరంగా కరపత్రాల పంపిణీ

**గార్ల, ఏప్రిల్ 16, ప్రభాతగమనం :**
గార్ల, బయ్యారం, గంగారం, కొత్తగూడ మండలాలను కలిపి ప్రత్యేక ఏజెన్సీ అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ 'నియోజకవర్గ సాధన జె.ఏ.సి (JAC)' ఆధ్వర్యంలో ఉద్యమం ఊపందుకుంది. గురువారం గార్ల మండలంలో పర్యటించిన జె.ఏ.సి నాయకులు, ఉద్యమానికి మద్దతు కూడగట్టే క్రమంలో భాగంగా సి.పి.ఐ (యం.ఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కామ్రేడ్ గుగులోత్ సక్రును కలిసి కరపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు జి. సక్రు మాట్లాడుతూ, గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ షెడ్యూల్డ్ ప్రాంత మండలాలు వేర్వేరు నియోజకవర్గాల్లో కలిసిపోయి, అస్తిత్వాన్ని కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్ఛిన్నమైన భౌగోళిక పరిస్థితుల వల్ల ఈ ప్రాంతాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు.అమరవీరుల ఆశయాలైన 'జల్-జమీన్-జంగ్' స్ఫూర్తితో, ఈ నాలుగు గిరిజన మండలాల ప్రజలు, మేధావులు, యువత ఏకమై ప్రత్యేక నియోజకవర్గ సాధన కోసం ఉద్యమించాలని సక్రు పిలుపునిచ్చారు. ఈ ధర్మపోరాటంలో న్యూడెమోక్రసీ పార్టీ అగ్రభాగాన నిలిచి పూర్తి మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో జె.ఏ.సి చైర్మన్ బాణోత్ చందర్ నాయక్, సభ్యులు మద్దినేని గుట్టయ్య, కొమిరె సాకీ, మహ్మద్ సుభాన్, తమ్మిశెట్టి రాందాస్ పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు మాలతి, మాల్యా, చంటి, ఉపేందర్, పి. రామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు
# సర్టిఫికెట్ల అందజేత..

- విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి
- కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు



**కేసముద్రం, ఏప్రిల్ 16(ప్రభాత గమనం):**
కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఇటీవలే కేసముద్రం మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలోని రుగ్మతలను అర్థం చేసుకుని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయంతో సమాజానికి సేవలు అందించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా పొందిన సర్టిఫికెట్లు విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ నాయక్, అధ్యాపకులు మైసయ్య, ప్రవీణ్ కుమార్, రాజు, యాదగిరి, రవి, రమాదేవి, మున్నీ, మంజుల, సలీం తదితరులు, అలాగే బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




# మద్దివంచలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

- సీఈఓకు రైతుల విన్నపం

**మద్దివంచ (బయ్యారం), ప్రభాత గమనం :**
మద్దివంచ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ రైతు సంఘం నాయకులు బుధవారం సంబంధిత అధికారులకు విన్నవించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సీఈఓ వెంకటేశ్వర్లు గారిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు రాగం రమేష్ మాట్లాడుతూ, స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.సీతంపేటలో ఉన్న కొనుగోలు కేంద్రానికి పంటను తరలించాలంటే, రాంపురం వద్ద ఉన్న పాకాల ఏటి బ్రిడ్జి పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో అటుగా వెళ్లడం ప్రమాదకరంగా మారింది.బ్రిడ్జి మీదుగా వెళ్లే అవకాశం లేక, రైతులు బయ్యారం చుట్టూ తిరిగి సుదూర ప్రాంతం గుండా పంటను తరలించాల్సి వస్తోంది. దీనివల్ల రవాణా ఖర్చులు భారీగా పెరిగి రైతులకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతోంది.సుదూర ప్రయాణం వల్ల సమయం వృథా కావడంతో పాటు, వర్షాలు వస్తే పంట తడిసిపోయే ప్రమాదం కూడా పొంచి ఉంది.మద్దివంచ గ్రామంలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల రైతులందరికీ ఎంతో మేలు జరుగుతుందని రమేష్ అభిప్రాయపడ్డారు. రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి త్వరగా కేంద్రాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.

## వాహనం నడిపేటప్పుడు
# నిర్లక్ష్యంగా ఉండొద్దు

- డ్రైవర్లే ప్రాణదాతలు
- వాహన డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు, సీపీఆర్ పై శిక్షణ
- ఐ.జి రమేష్ నాయుడు



**మహబూబాబాద్ ఏప్రిల్ 16(ప్రభాత గమనం):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమం సందర్భంగా, (అరైవ్ అలైవ్) 2026 లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్స్‌లో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, లారీ డ్రైవర్లు మరియు ఇతర వాహన డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ మరియు కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం సుమారు 1000 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రోడ్డు భద్రత & రైల్వేస్ ఐజీ కె. రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఎస్పీ డా. శబరీష్ ఐజీ ని మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. కేసముద్రం సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మరియు ఎస్పీ డా. శబరీష్, ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుండి ఎలా సమర్థవంతంగా అమలు చేస్తున్నారో ఫోటోల ద్వారా వివరించారు. అనంతరం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియోలను అన్ని వర్గాల డ్రైవర్లకు ప్రదర్శించి, ప్రాణాల విలువ మరియు ప్రమాదాలకు దారితీసే పొరపాట్లపై అవగాహన కల్పించారు.

తొర్రూరు సీఐ గణేష్ మాట్లాడుతూ..సురక్షిత డ్రైవింగ్ విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని తప్పుల గురించి వివరించగా, మోటార్ వాహన ఇన్స్పెక్టర్ సాయి చరణ్ గారు డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానం, వాహన పత్రాల నిర్వహణ, వంపుల్లో మరియు సూటి రహదారుల్లో పాటించాల్సిన వేగ పరిమితులు, వాహన నియంత్రణపై అన్ని వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రవి రాథోడ్ మాట్లాడుతూ..డ్రైవర్లు ఎల్లప్పుడూ అత్యవసర నంబర్లు కలిగి ఉండాలని సూచిస్తూ, ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పేర్కొంటూ ఆ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, లారీ డ్రైవర్లు మరియు ఇతర వాహన డ్రైవర్లు కేవలం ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చేవారే కాకుండా ప్రమాదాల సమయంలో ముందుగా స్పందించే ప్రాణదాతలని తెలిపారు. ప్రతి డ్రైవర్‌కు సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరిగా ఉండాలని, తెలియనివారు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్ని వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించడం, అలాగే సీపీఆర్ శిక్షణ ఇవ్వడం అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఐజీ కె. రమేష్ నాయుడు మాట్లాడుతూ..**

తెలంగాణ రాష్ట్రం రోడ్డు ప్రమాదాల విషయంలో దేశంలో 8వ స్థానంలో ఉందని తెలిపారు. రోజుకు సుమారు 70 మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటూ, దాని ప్రభావాన్ని నెలవారీ, వార్షిక స్థాయిలో వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకూడదని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని సూచించారు. అలాగే డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా నివారించాలని, అలసటగా ఉన్నప్పుడు వాహనం నడపకూడదని హెచ్చరించారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, ప్రతి వాహన డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రాణ నష్టం తగ్గుతుందని అన్నారు. తన అనుభవాలను పంచుకుంటూ అన్ని వర్గాల డ్రైవర్లు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం ఐజీ రమేష్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా ఎస్పీ డా. శబరీష్ ల చేతుల మీదుగా అర్హులైన డ్రైవర్లకు కళ్లద్దాలు పంపిణీ చేయబడింది. అలాగే ఏర్పాటు చేసిన కంటి పరీక్ష శిబిరాన్ని ముఖ్య అతిథులు పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఘనంగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

- 99 రోజుల మండల సభ కార్యక్రమాలు విజయవంతం
- ప్రజల ముంగిటకే ప్రభుత్వం.. మరిపెడ మండల సభలో వినతుల వెల్లువ!
- ఆర్గానిక్ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి : కలెక్టర్ స్నేహ శబరీష్
- డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలి..
- రోడ్డు భద్రతపై అవగాహన
- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగితే చర్యలు తప్పవు :కలెక్టర్ హెచ్చరిక



**మహబూబాబాద్ ఏప్రిల్ 16(ప్రభాత గమనం):** మరిపెడ మండల కేంద్రంలోనీ ఆడిటోరియంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరయ్యారు. మండల సభలో పాల్గొన్న కౌన్సిలర్లు, గ్రామపంచాయతీ సర్పంచులు తమ పరిధిలోని ప్రజలు తమ పరిధిలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. 12వ వార్డు కౌన్సిలర్ గౌతంరెడ్డి తమ వార్డు పరిధిలో సిసి రోడ్లు అంతర్గతనం అభివృద్ధి పనులు చేయవలసిందిగా కోరారు. వీరారం ఏడవ వార్డు లో బోర్ రిపేర్ చేయాలని కోరారు. బాల్య తండ సర్పంచ్ కెనాల్ పనులు పూర్తి చేయాలని కోరారు. నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వం అత్యంత ప్రతిష్ట ఆత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న 99 రోజుల పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా (10) థీమ్ ల వారిగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రోడ్ సేఫ్టీ, హెల్మెట్ సీట్ బెల్ట్, రవాణా భద్రతపై ఈ వారం రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతిరోజు ఒక అంశంపై జిల్లా ఎస్పీ శబరిష్, జిల్లా అధికారులు రవాణా శాఖ సిబ్బంది విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలోని యువత చెడు సహవాసాలకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని అలాంటి సంఘటనలు ఏమైనా ఉంటే తెలియపరచి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా ప్రమాదాలు జరిగే మరిపెడ ప్రాంతంలో ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఉండాలని సూచించారు, పట్టణంలోని క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై ఎవరైనా సిబ్బంది గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలను ఇబ్బంది పెట్టి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరిపెడ మండలం లో ఇరిగేషన్, త్రాగునీరు, సానిటేషన్, హెల్త్ ,ఎడ్యుకేషన్ తదితర అంశాలలో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ మండల సభలో పాల్గొని వివిధ సమస్యలను వినతులను సమర్పించిన వివరాలను స్వీకరించి వెంటనే పరిష్కరిస్తామని అట్టి సమాచారాన్ని తెలియపరచడం జరుగుతుందని అన్నారు. వరి పంటలు కాకుండా ఇతర వాణిజ్య పంటల వైపు రైతులను ముగ్గు చూపే విధంగా చర్యలు తీసుకోవాలని, అధిక శాతం యూరియా వాడితే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు, కావున ప్రజా ప్రతినిధులు ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువుల వైపు రైతులు ముగ్గు చూపే విధంగా చూడాలని రైతులు కూడా బాధ్యత అధికంగా కెమికల్స్ ఫర్టిలైజర్స్ ను తగ్గించాలన్నారు. నానో యూరియా ఇతర ప్రత్యామ్నాయ మందులను వాడాలని సేంద్రియ ఎరువులు మంచివని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక నిర్ణయం తీసుకొని ఆర్గానిక్ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, ఎస్పీ ఎలాగైతే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో ప్రతి ఒక్కరు సర్పంచులు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా నిర్ణయించుకుని సమాజం బాగు యువత సన్మార్గంలో నడవడానికి కంకణ బద్ధులై పని చేయాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించే (10) థీమ్ లో ప్రస్తుతం నడుస్తున్న రోడ్డు భద్రత కార్యక్రమాలు, రానున్న డ్రగ్స్ నివారణ కార్యక్రమాలను చైతన్యవంతంగా నిర్వహించాలని, ఇప్పటికే గ్రామ సభలు, మండల సభలు నిర్వహించి వచ్చే నియోజకవర్గస్థాయి సమావేశంలో ఇట్టి సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ విసారపు ప్రగతి, వైస్ చైర్పర్సన్ కాలం సునీత, సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి, వైస్ చైర్మన్ కాలం సునీత, మున్సిపల్ కమిషనర్ విజయనంద్, తాసిల్దార్ కృష్ణవేణి, అగ్రికల్చర్ ఏవో వీరాసింగ్, హౌసింగ్, మున్సిపల్ ఏఈలు ఉషా కీర్తి, శృతి, మండల వైద్యాధికారి డాక్టర్ రవి,ఎంఈఓ అనిత, సిడిపిఓ ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు డీజీపీని కలిసిన
# వరంగల్ సీపీ సింగ్

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర సీఐడీ, ఏసీబీ, ఉమెన్ సేఫ్టీ విభాగాల అదనపు డీజీపీ చారు సిన్హా గురువారం హనుమకొండకు విచ్చేశారు. రోడ్డు రవాణా శాఖ మరియు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆమె హనుమకొండలోని పోలీస్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. అదనపు డీజీపీని కలిసిన వారిలో డీసీపీలు ధార కవిత, అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, సీఐడీ అదనపు ఎస్పీ జితేందర్, ఏసీబీ డీఎస్పీ సాంబయ్యతో పాటు సీఐడీ, ఏసీబీ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## హత్యాయత్నం కేసులో
# నిందితుడికి రెండేళ్ల జైలు

- రూ. 3000 జరిమానా విధిస్తూ భూపాలపల్లి కోర్టు తీర్పు
- తండ్రితో అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళపై బీరు సీసాతో దాడి చేసిన యువకుడు



**భూపాలపల్లి , ఏప్రిల్ 16 (ప్రభాత గమనం):** హత్యాయత్నం కేసులో నేరం రుజువైన నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3000 జరిమానా విధిస్తూ భూపాలపల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఏ. నాగరాజు గురువారం సంచలన తీర్పు వెలువరించారు. ఘణపురం మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ కుమార్తెకు, అదే గ్రామానికి చెందిన మాల మల్లయ్యకు మధ్య గతంలో అక్రమ సంబంధం ఉండేది. ఈ విషయంపై ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరగగా, పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి వారిని విడదీశారు. అప్పటి నుండి బాధిత మహిళ తన తల్లి ఇంట్లోనే నివసిస్తోంది. పాత కక్షలను మనసులో పెట్టుకున్న మల్లయ్య కుమారుడు మాల రాజు, 2021 జూలై 7న సాయంత్రం సమయంలో కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి వస్తున్న సదరు మహిళను అడ్డుకున్నాడు. "నీ కుమార్తె వల్ల మా నాన్న పరువు పోయింది" అంటూ గొడవకు దిగి, వెంట తెచ్చుకున్న బీరు సీసాతో ఆమె తలపై బలంగా బాదాడు. అనంతరం వీపులో పొడిచి తీవ్రంగా గాయపరిచి అక్కడి నుండి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఘణపురం ఎస్.హెచ్.ఓ ఎస్. రాజన్ బాబు నిందితుడిని అరెస్ట్ చేయగా, ఎస్.ఐ జి. ఉదయ్ కిరణ్ దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (APP) ఎం.డి. రఫీ బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడు మాల రాజుపై నేరం రుజువైనట్లు నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను, కోర్టు కానిస్టేబుల్ పి. శ్వేతను ఎస్పీ సంకీర్త్ ప్రత్యేకంగా అభినందించారు.



## తెలంగాణ ఏర్పాటును
# దేశ విభజనతో పోల్చడం దుర్మార్గం

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**హైదరాబాద్, ప్రభాత గమనం :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన ప్రజలు అహింసా మార్గంలో ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం యావత్ ప్రపంచానికి తెలిసిందేనని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని మర్చిపోయి బీజేపీ ఎంపీ దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడిన ఆయన తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఈ వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన తెలంగాణకు చెందిన బీజేపీ,కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

# ఎల్కతుర్తి ఎస్సైపై బదిలీ వేటు

- అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏఆర్ కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు
- విచారణలో నిజమని తేలడంతో సీపీ సన్ ప్రీత్ సింగ్ చర్యలు
- ఇసుక అక్రమ రవాణా, భూ వివాదాల్లో తలదూర్చినట్లు నిర్ధారణ




**వరంగల్ క్రైం, ఏప్రిల్ 16 (ప్రభాత గమనం):** విధుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ కుమార్ పై బదిలీ వేటు పడింది. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలు ప్రాథమిక విచారణలో నిజమని తేలడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ ను సిటీ ఏఆర్ (AR) హెడ్ క్వార్టర్స్ కు అటాచ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

**వరుస ఫిర్యాదులే కారణం:**

గత కొంతకాలంగా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా, భూ వివాదాలు మరియు ఇతర సివిల్ పంచాయతీల్లో ఎస్సై ప్రవీణ్ కుమార్ తలదూరుస్తున్నారని ఉన్నతాధికారులకు వరుసగా ఫిర్యాదులు అందాయి. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన సీపీ, అంతర్గత విచారణకు ఆదేశించారు. ఇంటెలిజెన్స్, ఉన్నతాధికారులు జరిపిన విచారణలో ఎస్సై తీరుపై సమగ్ర నివేదికను కమిషనర్ కు సమర్పించారు.

**క్రమశిక్షణ చర్యల్లో భాగంగా బదిలీ:**

అధికారులు సమర్పించిన నివేదికలో ఎస్సైపై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను తక్షణమే విధుల నుంచి తొలగించి ఏఆర్ కు పంపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా సహించేది లేదని ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. కాగా, ప్రవీణ్ కుమార్ బదిలీతో ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ కు కొత్త ఎస్సైగా ఎవరిని నియమిస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం స్టేషన్ బాధ్యతలను స్థానిక సీఐ పర్యవేక్షిస్తున్నారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

**మరిపెడ, ప్రభాత గమనం :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలో విషాద చాయలు అలుముకున్నాయి. వేర్వేరు చోట్ల జరిగిన రెండు ప్రమాదకర ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.మరిపెడ మున్సిపాలిటీకి చెందిన తమ్మనబోయిన వీరన్న (42) మూడు రోజుల క్రితం చేపల చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. అప్పటి నుండి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం నల్ల చెరువులో మృతదేహం కనిపించడంతో పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో, సీతారాంపురం కాలనీకి చెందిన బోర గంగయ్య (55) రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. బుధవారం రాత్రి ఆయన ద్విచక్ర వాహనంపై మాచినపల్లి నుండి వస్తుండగా, దేశ్యా తండా వద్ద NH-365పై ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగయ్య అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఒకేసారి ఇద్దరు వ్యక్తులు మరణించడంతో స్థానిక కాలనీల్లో విషాదం నెలకొంది.




# సురక్షిత ప్రయాణమే లక్ష్యం..

- 'అరైవ్ అలైవ్'తో రోడ్డు భద్రతపై అవగాహన
- ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటించాలి
- అడిషనల్ డీజీపీ చారు సిన్హా




**హనుమకొండ, ఏప్రిల్ 16 (ప్రభాత గమనం):** రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు భద్రతా నియమాలను విధిగా పాటించేలా చైతన్యపరచడమే 'అరైవ్ అలైవ్' (Arrive Alive) కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర అడిషనల్ డీజీపీ చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం భీమారం సమీపంలోని కేఎల్ఎన్ ఫంక్షన్ హాలులో వరంగల్ పోలీస్ కమిషనరేట్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలపై వీడియోలు, స్కిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రుత్విక్ అనే బాలుడు మాట్లాడుతూ.. తన తండ్రి హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదంలో మరణించారని చెప్పిన మాటలు సభలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. ముఖ్య అతిథిగా హాజరైన చారు సిన్హా మాట్లాడుతూ.. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు సురక్షిత ప్రయాణం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అతివేగం, అజాగ్రత్త వల్ల ప్రాణాలు పోతున్నాయని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను ఒక బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన:

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఈ నెల 13న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 18వ తేదీ వరకు కొనసాగుతాయని, యువత మరియు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. డ్రైవర్లకు కళ్లద్దాలు పంపిణీ చేసేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నామన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. మీ కోసం ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారన్న విషయాన్ని గుర్తించి డ్రైవింగ్ చేయాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, ఆదర్శవంతంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పలువురు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని డ్రైవర్లు, ప్రజల చేత అధికారుల సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ధార కవిత, అంకిత్ కుమార్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీటీఓ సురేష్ రెడ్డి, ఎంవీఐలు మరియు ఇతర పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాహనదారులకు
# రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో**

సంగెం మండలంలోని కాపుల కనపర్తి గ్రామంలో గురువారం సీఐ రాజగోపాల్, ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాపుల కనపర్తి బస్టాండ్ ప్రాంతంలో ఆటో డ్రైవర్లకు, ఇతర వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతపై, అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ ఆటో డ్రైవర్లకు, జీప్ డ్రైవర్లకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. వాహనం నడుపుతూ సెల్ ఫోన్ వినియోగించడం పూర్తిగా నిషేధం ఇది ప్రమాదాలకు దారితీస్తుందని అనుమతికి మించి ప్రయాణికుల సంఖ్య ఆటోలో తీసుకెళ్లడం కుదరదని ఈ ప్రయాణికులకు డ్రైవర్ల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని టాక్సీ డ్రైవర్ల వద్ద సరైన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి, అలాగే ప్రతి ఆటోకు సరియైన ఇన్సూరెన్స్ ఉండి సమయానుకూలంగా రెన్యువల్ చేసుకోని, ప్రతి ఆటో డ్రైవర్ యూనిఫామ్ ధరించి నడపాలి మద్యం సేవించి ఆటో నడుపుట వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సూచించారు. ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరి పాటించాలని ప్రతి డ్రైవర్ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది ఆటో డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసి, లైసెన్సులు, ఇన్సూరెన్స్ లు మొదలగు పత్రాలు లేని ఆటోలకు ఫైన్లు విధించారు. ఈ కార్యక్రమంలో సంగెం ఎస్సై వంశీకృష్ణతో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులో
# కలెక్టర్ చాహత్ తనిఖీ

**హనుమకొండ, ప్రభాత గమనం :** హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు. చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లో ట్రాఫిక్ కూడళ్ళు, సిగ్నల్స్, యూటర్న్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పాఠశాలల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్మించడాన్ని జిల్లా కలెక్టర్ 1పరిశీలించారు. చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ గురించిన వివరాలను కలెక్టర్ కు ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు వేణుగోపాల్, రమేష్ రాథోడ్, కిషోర్ బాబు, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్

- భాగ్యనగరంలో అమెరికన్ దిగ్గజం భారీ పెట్టుబడి
- అమెరికా వెలుపల తొలి గ్లోబల్ సెంటర్ హైదరాబాద్ లోనే ప్రారంభం
- 1500 మందికి ఉపాధి కల్పనే లక్ష్యం.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో భారీ ఆఫీస్
- వర్చువల్ గా ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత గమనం):**
గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ హబ్‌గా హైదరాబాద్ నగరం మరో అంతర్జాతీయ మైలురాయిని అధిరోహించింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ 'ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్' (LPL Financial) తన మొట్టమొదటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC)ను హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించింది. అమెరికా వెలుపల ఈ సంస్థ ఏర్పాటు చేసిన తొలి కేంద్రం ఇదే కావడం విశేషం.

### భారీ కార్యాలయం.. వేలాది ఉద్యోగాలు:

నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఐదు అంతస్తుల్లో, సుమారు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక కార్యాలయాన్ని సంస్థ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో కార్యకలాపాలు మొదలుపెట్టిన ఈ సంస్థ, 2027 నాటికి శాశ్వత భవనంలోకి మారనుంది. రానున్న రోజుల్లో మొత్తం 1500 మంది నిపుణులను నియమించుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది చివరి నాటికే దాదాపు 700 మంది ఉద్యోగుల భర్తీ ప్రక్రియను పూర్తి చేయనుంది.

### జీసీసీలకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్:

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఈ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రస్తుతం సుమారు 450 జీసీసీలకు నిలయంగా మారిందని వెల్లడించారు. ఇవి సుమారు 1.3 లక్షల అత్యున్నత స్థాయి సాంకేతిక ఉద్యోగాలను సృష్టించాయని తెలిపారు. గత ఏడాది కాలంలోనే 80 కొత్త జీసీసీలు నగరానికి రావడం గర్వకారణమని, ఎల్‌పీఎల్ వంటి ఫార్చ్యూన్ 500 సంస్థ రాకతో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ క్రెడిబిలిటీ మరింత పెరిగిందని ఆయన కొనియాడారు.

### టాలెంట్‌కు పట్టం:

హైదరాబాద్‌లోని అద్భుతమైన ప్రతిభ (Talent) వల్లే ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎల్‌పీఎల్ సీటీవో గ్రెగ్ గేట్స్ స్పష్టం చేశారు. ఈ కేంద్రం టెక్నాలజీ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అమెరికా కార్యకలాపాలకు వెన్నుముకగా నిలుస్తుందని ఎల్‌పీఎల్ ఇండియా హెడ్ రమేష్ కాజా వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా 32 వేల మంది అడ్వైజర్లకు సేవలందిస్తూ, 2.4 ట్రిలియన్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తున్న ఈ సంస్థకు హైదరాబాద్ కేంద్రం అత్యంత కీలకం కానుంది.

# ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- కర్ణాటక ఎంపీపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం
- రాష్ట్ర ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చడం సిగ్గుచేటు
- బీజేపీ ఎంపీలకు చీము, నెత్తురు లేదా? అని నిలదీత

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (ప్రభాత గమనం):**
పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, ఆంధ్రప్రదేశ్ విభజనను అవమానించేలా మాట్లాడిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను కించపరిచిన ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ జరుగుతుండగా, కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య మాట్లాడుతూ.. గత యూపీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజనను భారత్–పాకిస్తాన్ విభజన కంటే దారుణంగా చేసిందంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కార్చిచ్చు రేపాయి. తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై స్పందిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు. "బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం ఏర్పాటైన తెలంగాణను.. దేశ విభజనతో పోల్చుతారా? తేజస్వీ సూర్య ఒక తెలివి లేని వెధవలా మాట్లాడుతున్నారు" అంటూ మండిపడ్డారు. నాలుగు దశాబ్దాల పోరాటాన్ని, వందలాది మంది బలిదానాలను గౌరవించి సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే.. దాన్ని అవహేళన చేయడం బీజేపీ నైజమని విమర్శించారు. "పార్లమెంట్‌లో తెలంగాణ గౌరవం మంటగలుస్తుంటే, ఇక్కడి బీజేపీ ఎంపీలకు చీము, నెత్తురు లేదా? వారు కనీసం ఎందుకు నోరు విప్పలేదు?" అని మంత్రి నిలదీశారు. గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా కూడా తెలంగాణ ఏర్పాటును అవమానించారని, ఇప్పుడు తేజస్వీ సూర్య కూడా అదే బాటలో నడుస్తున్నారని ఆరోపించారు.

### పదవి నుంచి బర్తరఫ్ చేయాలని స్పీకర్‌కు లేఖ:

తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచిన తేజస్వీ సూర్యను ఎంపీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. "2001లో మూడు రాష్ట్రాలు ఇచ్చిన బీజేపీ, తెలంగాణను ఎందుకు ఇవ్వలేదు? అడ్డగోలుగా మాట్లాడితే ఖబడ్దార్" అంటూ ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన రాష్ట్రాన్ని కించపరిచిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.



# సెంట్రల్ హాల్ పనులు ప్రారంభించండి..

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత గమనం) :**
శాసనమండలి, శాసనసభ మధ్యలో మిగిలిపోయిన సెంట్రల్ హాల్ పనులను ప్రారంభించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో ఆర్అండ్‌బీ, ఆగాఖాన్ సంస్థ, తెలంగాణ లెజిస్లేచర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ హాల్‌ను డిజైన్ చేసి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

# 18న మ్యూజియాలకు ఉచిత ప్రవేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 16, (ప్రభాత గమనం):**
ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా తెలంగాణ హెరిటేజ్ శాఖ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియాలు, చారిత్రక కట్టడాలకు ఈ నెల 18న ఉచిత ప్రవేశాలను కల్పిస్తున్నట్టు సాంస్కృతికశాఖ తెలిపింది. పబ్లిక్‌గార్డెన్‌లోని స్టేట్ మ్యూజియంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించింది.



# తమిళనాడు ఎన్నికల్లో 'విజయ' నాదం..

- భారీ హామీలతో టీవీకే మ్యానిఫెస్టో!
- పేదింటి పెళ్లికి 8 గ్రాముల బంగారం.. మహిళలకు నెలకు రూ. 2,500
- రైతులకు రుణమాఫీ, ధాన్యానికి రూ. 3,500 మద్దతు ధర
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగ భృతితో ఓటర్లకు గాలం


**చెన్నై, ఏప్రిల్ 17 (ప్రభాత గమనం):**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరం ముంచుకొస్తున్న వేళ, 'తమిళగ వెట్రి కళగం' (TVK) అధినేత, సినీ నటుడు విజయ్ తన పార్టీ ఎన్నికల ప్రణాళికను (మ్యానిఫెస్టో) గురువారం విడుదల చేశారు. బడుగు, బలహీన వర్గాలే లక్ష్యంగా వరాల జల్లు కురిపిస్తూ విజయ్ ప్రకటించిన హామీలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

### మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు:

- బంగారు కానుక: పేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లికి 8 గ్రాముల బంగారం (ఒక తులం)తో పాటు నాణ్యమైన పట్టుచీరను ప్రభుత్వం తరపున అందజేస్తామని హామీ ఇచ్చారు.
- నగదు సాయం: 60 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం అందిస్తామన్నారు.
- మహిళా సంఘాలు: స్వయం సహాయక సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని ప్రకటించారు.
- రుణమాఫీ: ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు.
- మద్దతు ధర: క్వింటా ధాన్యానికి రూ. 3,500 కనీస మద్దతు ధర (MSP) చెల్లిస్తామని వెల్లడించారు.
- నిరుద్యోగ భృతి: చదువుకున్న యువతకు ఉపాధి లభించే వరకు నెలకు రూ. 4,000 నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు.
- ఉచిత విద్యుత్: సామాన్య ప్రజలకు ఊరటనిస్తూ ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. తమిళనాడు రాజకీయాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా, ప్రజల కనీస అవసరాలను తీర్చే దిశగా తమ మేనిఫెస్టోను రూపొందించినట్లు ఈ సందర్భంగా విజయ్ స్పష్టం చేశారు. విజయ్ ప్రకటించిన ఈ భారీ హామీలు ఓటర్లను ఏ మేరకు ఆకట్టుకుంటాయో చూడాలి.

# బోడుప్పల్‌లో కసాయి పిన్ని..

- పసివాడికి జ్యూస్ అని 'యాసిడ్' తాగించి దారుణం!
- తోడికోడలి బిడ్డపై అసూయతో హత్యాయత్నం
- తాతకు పెద్ద మనవడంటే ప్రాణమని కక్ష పెంచుకున్న చిన్న కోడలు
- చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడ.. మేడిపల్లి పోలీసుల కేసు నమోదు



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత గమనం):**
ప్రేమ, ఆత్మీయతలు ఉండాల్సిన ఉమ్మడి కుటుంబంలో అసూయ అగ్నిలా రగిలితే ఎంతటి దారుణానికి దారితీస్తుందో చెప్పేందుకు బోడుప్పల్‌లో జరిగిన ఈ ఘటనే సాక్ష్యం. తన బిడ్డ కంటే తోడికోడలి బిడ్డపై ఇంట్లో అందరూ ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారన్న అక్కసుతో ఒక మహిళ నాలుగేళ్ల పసివాడికి జ్యూస్ అని నమ్మించి యాసిడ్ తాగించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కలకలం రేపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

### అసూయకు బీజం పడిందిలా..

బోడుప్పల్ శ్రీనివాస కాలనీకి చెందిన పర్వతం సతీష్ కుమార్, అంజమ్మ దంపతుల కుమారులు నాగరాజు, జగదీష్. ఇద్దరూ తమ కుటుంబాలతో కలిసి ఒకే ఇంట్లో ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు నాగరాజుకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే, తాత సతీష్ కుమార్ పెద్ద మనవడిపైనే ఎక్కువ ప్రేమ చూపిస్తున్నాడని, తన కుమారుడిని పట్టించుకోవడం లేదని చిన్న కోడలు మంజుల మనసులో కక్ష పెంచుకుంది. ఇటీవల తాత తన చేతిపై పెద్ద మనవడి పేరును పచ్చబొట్టు (టాటూ) వేయించుకోవడంతో ఆమె ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పసివాడిని చంపేస్తేనే తన బిడ్డకు ప్రాధాన్యత దక్కుతుందని భావించింది.

### హత్యకు వరుస ప్రయత్నాలు:

మంజుల ఆ చిన్నారిని చంపేందుకు గతంలోనూ రెండుసార్లు ప్రయత్నించింది. బాలుడి ముక్కు, నోరు మూసి ఊపిరి ఆడకుండా చేసేందుకు ప్రయత్నించగా, చిన్నారి తల్లి చూసి ప్రశ్నించింది. దీంతో ఆడుకుంటున్నామని చెప్పి తప్పించుకుంది. ఇంటి పైఅంతస్తులో రెయిలింగ్ గోడపై కూర్చోబెట్టి కిందకు నెట్టేందుకు యత్నించగా, తాత గమనించి ఆమెను మందలించారు.

### అమానుషం.. జ్యూస్ అని యాసిడ్ తాగించి..

అయినప్పటికీ మంజులలో మార్పు రాలేదు. ఈ నెల 9న కిచెన్‌లో ఎవరూ లేని సమయం చూసి చిన్నారిని దగ్గరకు పిలిచింది. "జ్యూస్ తాగు.. నీకు చాక్లెట్ ఇస్తాను" అని నమ్మించి బలవంతంగా యాసిడ్ తాగించింది. అది తాగిన బాలుడు నొప్పితో విలవిలలాడుతూ గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు పరుగెత్తుకుంటూ వచ్చారు. వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన దారుణంపై చిన్నారి తల్లి బుధవారం (ఏప్రిల్ 15) రాత్రి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంజులపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కన్న బిడ్డలా చూసుకోవాల్సిన పిన్ని, ఇంతటి కర్కశత్వానికి ఒడిగట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కన్న బిడ్డలకే కాలయముడైన తండ్రి..

- ఆస్తి కోసం రెండో భార్యతో కలిసి హత్యకు కుట్ర!
- అర ఎకరం భూమి కోసం పసిపిల్లలకు విషం పెట్టాలని ప్లాన్
- కుట్రను బయటపెట్టిన మధ్యవర్తి.. నిందితులు శ్రీనివాస్, మమత అరెస్ట్
- జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బటి తండాలో దారుణం



**జనగామ, ఏప్రిల్ 17 (ప్రభాత గమనం):**
ఆస్తిపై వ్యామోహం కన్నప్రేమను కబళించింది. రక్తం పంచుకు పుట్టిన బిడ్డలే తన ఆస్తికి అడ్డువస్తున్నారని భావించిన ఓ తండ్రి, వారిని కడతేర్చేందుకు కర్కశంగా కుట్ర పన్నాడు. రెండో భార్యతో కలిసి ఇద్దరు పసిపిల్లలకు విషం పెట్టి చంపాలని చూసిన ఈ ఉదంతం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బటి తండాలో వెలుగులోకి వచ్చి తీవ్ర కలకలం రేపింది. పొట్టిగుబ్బటి తండాకు చెందిన బానోత్ శ్రీనివాస్‌కు 2016లో అనితతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కుటుంబ కలహాల కారణంగా శ్రీనివాస్ ఏడాది క్రితం మమత అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య అనిత పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా.. పిల్లల పేరిట అర ఎకరం భూమి, కొంత నగదు ఇవ్వాలని పెద్దలు తీర్పునిచ్చారు.

### అర ఎకరం కోసం అమానుషం:

పిల్లల పేరిట రాసిన ఆ అర ఎకరం భూమి కూడా తమకే దక్కాలనే దురాశతో శ్రీనివాస్, అతని రెండో భార్య మమత దారుణ నిర్ణయం తీసుకున్నారు. పిల్లలను శాశ్వతంగా అడ్డుతొలగించుకోవాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఒక వ్యక్తిని సంప్రదించి, విషం కలిపిన బిస్కెట్లను పిల్లలకు తినిపించాలని, అందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో డబ్బు ఇస్తామని ఆశ చూపారు. మొదట నిందితుల ఆఫర్‌కు అంగీకరించిన సదరు వ్యక్తి, తర్వాత పసిపిల్లలను చంపాలనే ఆలోచనతో భయపడ్డాడు. మనసు మార్చుకుని నేరుగా పిల్లల తల్లి అనిత దగ్గరకు వెళ్లి శ్రీనివాస్ పన్నిన కుట్రను వివరించాడు. తన పిల్లల ప్రాణాలకు ముప్పు ఉందని గ్రహించిన అనిత వెంటనే పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో కుట్ర నిజమేనని తేలడంతో నిందితులు శ్రీనివాస్, మమతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆస్తి కోసం కన్న పేగునే తెంచుకోవాలనుకున్న తండ్రి క్రూరత్వాన్ని చూసి స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374